వెన్నెల పరుగులు

వెంపటి నాగభూషణం

'రా...

'అక్కా డేం చేస్తున్నావు...రావేం... లోపలికి...'

— మాటలు అర్థమయినా, భావోద్వేగాన్ని సరిగా అర్థం చేసుకోలేని... చిన్నతనపు చాపల్యాన... అమాయికత్వాన... బాల, వినీవినిపించుకోకుండా... తువ్వాయిత్తో గంతులువేస్తూ ... చెంగిస్తూ ... ఆ ధ్యానంలోనే ఉండిపోయింది...

మళ్లా పిలిచింది...లోపలనుంచి...మళ్లా ...ఇంకోసారి...

ఊహుఁ...

రాజమ్మ... నిలువెల్లా కోపం తెప్పించుకుని... తలుపు విసిరివేసినట్లు తెరిచి... ధూకుడుగా, బయటికి...వచ్చింది...

—వచ్చి... ముందరికి అడుగు వేయబోయి ... పరవశిల్లి ... ఆలా ... ఆలా ...

మోహనగాన మానిత ప్రౌఢ కురంగాంగనా విభ్రమతో... నిలవబడిపోయింది...

వె

న్నె

ల...

...నున్నని ... ఒరపులులేని ... తెల్లదనం... పండి... వెల్లివిరిసిపోతూన్నది.

రేకెత్తిన కోరికలను జతచేసుకుని... చిరుగాలిఅలలమీద ... సుడివారకుండా... తేలిపోయే మనసును ... చిక్కబట్టుకుని... ధీరాలాపంతో... ప్రకృతాన్ని అవధరించుకుని...

'రా...తల్లీ ... ప్రొద్దుపోతూన్నది... పండుకుందువుగాని...'—అని లాలించింది...

'నేను...రానే...'

ఇంకా బుజ్జగించింది...

ఊహుఁ...

'చూడు... వెన్నెల ఎంతచక్కగా ఉన్నదో...నాకు నిద్రరావడంలేదు. — లక్ష్మి కూడా...ఎలా ... ఆడుకుంటూందో. దానికీ... నిద్ర...'

'—పద, ముందు... నీవేషాలూ, నీవూను. పో... లోపలికి పోయి...పడుకో. అల్లా దిక్కులుచూస్తావేం... పో...'

—రాయి అయిపోయిన గుండెకు... కిరాతకాఠిన్యం - నిర్దయ... మెరపించడం... ఎంతసుళువు!...

బాలకు... ఈ అన్యాయము బోధపడలేదు. వెన్నెలలో...హాయిగా ఆడుకోవడం... అపరాధమా?... అమ్మకు... వెన్నెల అంటే ఎందుకు అంతకోపం?... మిగతా విషయాల్లో... సమయాల్లో ... ఎంతో ఆపేక్షగా ప్రేమించి... లాలించే... కన్నతల్లి... వెన్నెల మాట ఎత్తితే ... అంత మండిపడటం... ఎందుకూ?... అందరుపిల్లలూ ... సావాసగత్తెలు... చక్కగా కబుర్లు చెప్పుకుంటూ... చందమామతో కేరింతలాడుతూ ... ఆరుబయట... వెన్నెలలో మునిగితేలుతూ... పడుకుని ... నిద్రపోతారే! ... అంతదాకా అక్కర్లేదు ... అడగటానికీ భయమే... కాస్సేపు... ఆడుకోకూడదూ?

— బాల... బెదురుతూ...తల్లికి దూరంగా ... తలవంచుకుని ... లోపలకు వెళ్లిపోయింది...

— వెంట ... రాజమ్మకూడా తిరిగిపోయింది: బాల... మంచంమీద...ఎగుడు దిగుడుగా ... తలగడమీదకు బోర్లపడుకుని... వెక్కి వెక్కి...

పక్కను కూర్చుని...ముఖం తిప్పి... ముంగురులు సరిజేస్తూ:...

'ఎందుకమ్మా... ఊరుకో. నే నేమన్నాననీ... ఏబ్బే... తప్పు. ఆలా... ఏడవకూడదు. సరిగా పడుకో... తప్పు... వినవూ...'

సముదాయించి... జోకొట్టినట్లు... కరలాలనతో ... స్పర్శతో ... నిద్రబుచ్చింది. తాను కూడా... ప్రక్కన... సర్దుకునిపడుకుని ... మసలి... చప్పుడుచేయకుండా బయటికి వచ్చి... వెన్నెలలో... కూర్చున్నది...

వె

న్నె

ల...

వె... న్నె...ల...

వలిపెపు ... తెలి ... నులిపొరలు... ఎన్నివంచనలను...దాచుకున్నాయి. వెన్నెల వెలుగులో ... మనసు నిలపలేకపోయినందుచేతనేకాదూ ... తనజీవితమంతా ... ఇలా చీకటి అయిపోయింది...

మానవంతుల వంశమర్యాదను... తన మానధనాన్ని ... అంతా కబళించివేసింది... ఈ... వన్నెల... వెన్నె లేకదూ...

ఆతడు ... ఎక్కడ ఉన్నాడో ... ఏం చేస్తున్నాడో? ఎందుకు... ఇంకా మమత? ... చేసిపోయిన ఘనకార్యం చాలదూ,... ఎన్నడో మరచిపోయిఉంటాడు. అభమూ—

శుభమూ ఎరుగని ... ఐనయింటిపిల్లను ... తనఅందంతో మోసంజేసి ... నమ్మికలిచ్చి తన దాన్ని చేసుకుని ... పనితీరిన వెనుక ... తిరిగీ చూడకుండా ... మాయమైపోయినాడు ...

—అతని కేం ...?

రాజమ్మకు ... కుటుంబమువారందరిలో ... తలవంపులై, తల్లి-తండ్రి...తనవారందరూ ... ఇంటనిలువనీయక ... తరిమివేయగా ... ఫలపరీపాకంకోసరం ... పసిపాపకోసం ... అన్ని అగచాట్లూ పడి ... ఒంటరిగా ... ఎవరూ ఎరుగనిచోట ... తలదాచుకోవలసిన యోగం పట్టింది ...

ఏటివొడ్డున కూర్చుని ... నగంలోతుకు వెళ్లి ... ఎన్నిసార్లు ప్రయత్నంచేసింది — ఈమాయలోకం వదలిపోవాలని ... కాని ...

బాల ... కన్నకడుపు ...

వెన్నెల ... మాయావాగురలో చిక్కకుండా ... ఆపిల్లను రక్షించి ... విజయగారవంతో ... అప్పుడూ ... ఉత్తరలో కాలవిషయం ... యోచనచేయడం ...

*   *   *

మనోహరాఖ్యాయికాపాఠక కరోద్వేగ చాలన ప్రవర్తితపత్రవైఖరిని ... చకచకా ... సంవత్సరములు తరలిపోయినవి.

వసంతలక్ష్మి మధుమాధవులకు ... ప్రణయ-విప్రలంభములు ... యథాక్రమాన— ఎన్నిసార్లో ... ఎన్నో ... సార్లు ... వంతులు తీరిపోయినవి ...

—ఎప్పుడూ ... ఆకొంటెదనంతో ... అదే ... వెన్నెల ! ...

*   *   *

గోధూళివేళ ... దాటిపోయింది ...

ఇంకా ...

బాల ... ఇంటికి రాలేదు.

చాలాపెందలకడనే ... ప్రొద్దు ఉండగానే ... వాడుకగా పాలుపోయడానికి-వెళ్లింది. నిత్యమూ ... అంతకన్న ముందే ... పోనీ-అప్పటికైనా ... తిరిగివచ్చేది ...

ఏమో ... ఎక్కడనైనా ఆలస్యం అయిందేమో. పనీపాటాలేని తీరికసంసారులు ... నిలవేసి ... మాటలలో పెట్టి-కదలనీయరు. భోజనంవేళదాకా, ఎలాగో వారికి కాలక్షేపం కావాలి. ఎదుటివాళ్ల తొందరతో ... పనేమిటి వాళ్లకు ...

—ఇంకా రాలేదు ...

ఎందుచేతనో ... వెనుకా-ముందూ చూడదు. తగనిసరదా ...

ఏమన్నా చూస్తూ ... ఆలకిస్తూ ... ఇంటిమాటే మరచిపోతుంది. అయినా, ఎంత జాగైనా ... ఈపాటికి ... ఏమో? ప్రొద్దుపోతూన్నది.—బాల రాలేదు ...

రాజమ్మమనస్సు ... నిలవడంలేదు — పరిపరివిధాల పోతూన్నది ... తగనిదిగులు— భయం ... పుట్టుకొస్తూన్నవి. కాలు కుదరడంలేదు ... ఏం చేయడానికీ ... తోచడంలేదు ...

—ఈలకూతలాగా ... సన్నగా మొదలుపెట్టి, గాలి హోరుగా మారిపోయింది. టప...టప ... దూరంగా, దూరంగా ... పెద్ద చినుకులు రాలుతూన్నవి...సన్నజల్లు ...

...ఇంకా రాలేదు...బాల...

ఎదురువెళుదామని...వాన పెద్దది అవుతుందేమోనని...గొడుగు తీసుకుని బయలుదేరింది:— మసకచీకటిలో...త్రోవను పోయే ప్రతివారినీ ... భ్రాంతితో తారసిల్లుతూ... అడుగడుగుకీ గమనవేగం అధికంచేస్తూ... పోయింది...పోయింది...

—అదే!...చూచాయగా ఆకారం... నడకకూడా...ఆలాగే ఉన్నది. 'అమ్మయ్య' అనుకుని, తెప్పరిల్లి ... దగ్గరకు వెళ్లి...ఆప్యాయంగా:

'ఏమమ్మా...'

—బాల కాదు! ఉలిక్కిపడి...వెనుకకు తగ్గింది. ఆపిల్లవాడు...ఏమనుకున్నాడో...హుంకరించి...వడివడి నడచిపోయినాడు: రాజమ్మకు...మనసు చచ్చిపోయింది...

ఊరు మాటుమణుగుతూన్నది: అప్పుడే...ఎక్కడా...సడీ చప్పుడూ లేదు...

చూడక...దోవలో అడ్డంగా పడుకుని ఉన్న కుక్కపిల్లమీద కాలువేసి...దద్దరిల్లి తప్పుకున్నది: శ్వానకిశోరం...గగ్గోలుగా... కంయి...కంయ్‌...లాడుతూ... కులంవారినందరినీ... రేపెట్టి పురికొల్పి—కాలుదువ్వించింది...

ఒకటి—రెండు...దూరంగానే ఉండి... రణదుందుభులు మ్రోగించినవి. మరో అతిరథుడు...సింహనాదంతో...మీదికి లంఘించబోయి ... ఛత్రప్రహారంతో ... కుంచితవాలంతో...ఉడాయించాడు...

—ఎక్కినగడప ఎక్కకుండా...ఎరిగి ఉన్న యిళ్లన్నీ తిరిగింది. పాలుపోసి... అప్పటికప్పుడే వెళ్లిపోయిందని...అందరూ... ఆశ్చర్యపడుతూ సమాధానమిచ్చారు...

వీలుదొరికితే...ఎకసక్కెం చేయడానికి తయారయ్యే జాణలకు ... బదులుతీర్చలేని అలుసురాలు కాదు, రాజమ్మ, వస్తుతః— కాని అప్పటిస్థితిలో అవిఏమీ గమనించలేదు...

అడుగులు సీసపుదిమ్మలైపోయినవి: కదల్పలేకపోతూన్నది. తూలుకుంటూ... వచ్చి, వచ్చి...ఇల్లుచేరుకుంటూ,...జారిన మనసును, కాలు అనుకరించడముచేత... బురదలో పడిపోయింది...

వెక్కిరించినట్లు...మబ్బులు చిమ్మేసుకుని...వెన్నెల...'నవ్వు...నవ్వు...బంగారంవంటి పిల్లను...మ్రింగేశావు. నవ్వు... నవ్వు...నీపొంగు ఎంతకాలమో...'

చేతులు...ఎంతఊతంగా చాచి శపించినా, — అందదుగనుక ... ధీమాతో...

చందమామ నవ్వుతూనేఉన్నాడు, — సిగ్గు పడకుండా... వన్నెతరగకుండా...

*   *   *

క్రొత్తలో... క్షణం యుగదీర్ఘమై... కదలక బాధపెట్టినా... కాలం, లోకమర్యాదా ను... క్రమాన గడచిపోతూనే ఉన్నది...

రాజమ్మకు... ఒంటరితనం... అలవాటు అయిపోయింది. బాలను, తలచుకోవడం... తలచుకొని... భరించలేక ...మాని వేసింది...

—ఒకటి... రెండు... మూడు... ఆలా, ఆలా... ఎనిమిది నెలలు... పరిణతపద్మదళము లగా... రాలిపోయినవి...

అదేవేళ...

పశువులశాలలోనుంచి వచ్చి... గోడ ఓరను ఉన్న మంచం... గుమ్మందగ్గరగా వా ల్చుకుని ... రాజమ్మ ... అప్పుడే వెన్ను వాల్చింది...

పాలేరుకుర్రవాళ్లు ... జనుము వామి వద్దకు జేర వేస్తున్నారు...

అంతలో... ఎవరు... ?

పాలుతీసి పట్టుకువచ్చాడు ... కమతగాడు, అనుకుని... చూడకుండా ...తన ధ్యాసలో ఉండిపోయింది; కా ని, వాడు పోయి... పనిచూసుకోకుండా ...ఆలాగా నిలవబడిఉన్నాడేం?...



" బాల ఏడుస్తూ తల్లి ఒడిలో తలదాచుకొని వాలిపోయింది. "

తీరుబడిగా ... ఒత్తిగిలి ... చూసి ... చూపును నమ్మలేక ... చూసి ... ఎగిరిపడి ... అమాంతం— కౌగలించుకున్నది ...

'అమ్మా ... అ ... మ్మా ...'

'మాతల్లి ... మా ... అమ్మ' ...

మరీ అనుకున్నది. తనకు ... అంత అదృష్టమా ... లేచిన వేళ ఎంతమంచిది ...

కౌగిలి వదలకుండానే ... తనసరసను కూర్చోబెట్టుకున్నది— నిమురుతూ ... పులకరించి, మైమరచిపోయింది ...

కలవరపడి ... మెళకువ తెచ్చుకున్నది ... ఎందుకో, బాల ... ఏడుస్తూ, తల్లిబడిలో తలదాచుకుని ... వాలిపోయింది ...

లేవదీసి ... సంగట పొదివిపట్టుకుని ... ఊరడించాలని ప్రయత్నంచేసింది. అంతకంతకు మన్యువేగం ... అతివేల మైపోయింది ... ఏమీ చేయలేక, రిచ్చపడి ... అలా చూస్తూ ... చూస్తూ ... ఊరుకోక ... ఏం ... చేయగలదు ...

'అమ్మా ... నన్ను ... క్షమించు ...'

— బాల ... గాద్గదికంతో ... వేడుకోవడం ... ఆమె ధైర్యకవచానికి వజ్రఘాత మైనది:— కూతుర్ని అనుకరించింది ...

ఇద్దరిసందునా నలిగి ... రోదనాలాపం ... నీరసిల్లి ... క్రమంగా ... ఓక్రమానకు అంతరించింది ...

'అమ్మా ...'

'అమ్మ ...'

'నేను ... ఎంత ... పాపం ... చేశాను ...'

'లేదమ్మా ... పిచ్చితల్లి ... ఊరుకో ...'

'ఆతని .... మాటలు .... దొంగమాటలు : నిజమని ... నమ్మి ...'

'... ... ...'

'వెన్నెలలో ... భ్రమసిపోయి ...'

వె ...

న్నె ...

ల ...

వె ... న్నె ... ల ... — ఆ మాటతో రాజమ్మకు ఆవేశం ముమ్మరమైపోయింది. కాని ... చలించనట్లు కనబడకుండా, గొంతు మారనీయకుండా :

'అంతేనమ్మా ... ఆజాతిలక్షణమే, అది! మగవాడన్న ప్రతీవాడూ ... అంతే ...'

'నేను ... తెలుసుకోలేక ... పోయినానమ్మా ...'

'అవును ... తల్లీ ...'

'నేను ... బ్రతకను ...'

'అమ్మా ... నాకోసం, ... నన్ను చూసుకుని ... నన్నేంచేసి పోదలచుకున్నావు ...'

'ఇంతమంచిదానివి ... ఋషివి ... దేవతవు ... నిన్ను ... మోసంచేశాను ... నేను ... నే ... ను ...'

—ఈమారు ... కౌగిలిలో ... బాల, క్షమా— ఆశీర్వాదాన్ని ... సేకరించుకుని ... కలకలలాడిపోయింది ...

మళ్ళా...ఇల్లు—కలకలలాడింది...

బాల...ఓపలేనితనం...ఆతల్లి ఆనందాన్ని లేతపరవళ్లు కొట్టించింది...

ముచ్చటగా...మూడురోజులు...

బద్ధకం...కనబడకుండానే, ... పెళ... పెళ... నెప్పులు,... కేరు... కే...రు...

—పొత్తిళ్లలో బాలమీద చేయివేసుకుని... బాల...నీరసంగా:

'అమ్మా...'—అని పిలిచింది.

వినిపించుకుని వచ్చేలోపల... మరీ నీరసంగా:

'అ...మ్మా...'

తల్లి దగ్గరకు వెళ్లి...నిలుచున్నది...

దగ్గరగా...వొంగమని...బాల...సైగ చేసి...

—'ఈ...పసిగుడ్డను...ఎలా... పెంచి...'

'ఛ్ ... ఆలాటిమాటలుఅనబోకు ... నీకువచ్చినభయమేం... లేదు, తల్లీ...'

'ఎలా...పెంచి...పెద్దదాన్ని...చేస్తావో: నేను చేసినది...చాలక...నీమెడకు... ఈ...ఈ...'

రాజమ్మ...ఆవురుమన్నది...

—'నీ...ఋణం...తీర్చు... కోలేను. తల్లిలేని...పక్షి...ఎలా...ఎలా. వెన్నెల...లో, వె...న్నె...లమోసం...చేస్తుంది, జాగ్రత...వె...న్నె...ల...'

... మధ్యమపదలోపి ... ప్రథమావతరణమైనది...ఆ...సంసారం...

* * *

యౌవన...వార్ధక్యాలు—ఏక దోహదాన్నే...ప్రవృత్తివ్యత్యస్థాన — వృద్ధిచెందడం...సృష్టినిసర్గవిశేషం...

సుందరి...తల్లిచక్కదనాన్ని ... మరపిస్తున్నా, తల్లితల్లికి...ఆమెకన్నతల్లిని...అనుక్షణం...జ్ఞాపకంచేస్తూన్నది. వయసువచ్చిన కొద్దీ...మరీని...

రాజమ్మ ... వెనుక ... తెలియక చేసిన ...తప్పను దిద్దుకున్నది. దాచకుండా... బాలతో... ఆమె జననవృత్తాంతానికి... పూర్వరంగంగా తను విశదీకరించినట్లయితే... తెలివిగలిగి, ...ఆలా ...మోసపోయి ...చివరకు...ఆమాదిరిగా అయిపోయేదికాదుకదా ...అని...ఒకొక్కప్పుడు—చాలా ...వేదనపడేది...

—అందు'ని, సుందరికి...బుద్ధితెలియగానే...తమయిద్దరి...కథలూ...జరిగినదానికన్న...మరీదారుణంగా...చిత్రించి,...భయపెట్టింది. మరచిపోకుండా...చూస్తూన్నది...

ఒకనిమిషం ... ఎడబాయదు. ... ఎవరితోనూ...తనకు...నచ్చనివాళ్లతో ... మాటాడనీయదు. మొగపురుగునైనా...సుందరి చాయల...వాలనీయదు...

ఆపిల్ల కూడా...ఆజన్మ సిద్ధపురుష ద్వేషిణీ భూమికను ... చక్కగా ...నిర్వహించుకొని వస్తున్నది.

*   *   *

రసవిలాసంలో ...కరగి, కలసి... ఒకటైపోతూ...ఆజంట... ఈ ముదుసలి... విధూతగమనాన్ని ...గమనించే అవసరం... ఏమున్నది...?



"ఒకరికొకరు.... చేతులు పెనవేసుకొని నడచిపోయినారు."

—చెరువుగట్టున ... నారుమడి ముదురాకు వేస్తున్నదేమోనని...చూసుకుని,— చేలోకి దిగబోతున్న మందను మళ్ళేసి... వంగతోటదగ్గర ఆగి, ఒడినింపుకుని...తిరిగి వచ్చేస్తూ...నిర్జీవప్రతిమ అయిపోయింది...

మీటనొక్కితే... వెలుగులు విడబడినట్లు... వెన్నెల ... వె... న్నె ...ల ...

నేలమీదకు వాలిపోయిన మ్రానుమీద...ఒకరికౌగిలిలో...ఒకరు...—ఇద్దరు వ్యక్తులు!...

—స్పష్టంగా...మాటలు ... వినబడుతూన్నవి...

'నిన్ను ...విడిచి...ఉండలేను...'

ఆ...వంచకుడు... కుహూయించుతున్నాడు :

'నేనూ...వదలలేను...'—అని, తడబడకుండా అంటూంది...కృతఘ్నురాలు...

'అయితే...పోదాం...పద...'

—ఒకరికొకరు...భుజాలమీద చేతులు

పెనవేసుకుని...తిరిగిఅయినా చూడకుండా ...నడచిపోయినారు...

రాజమ్మ ... కూలిపోయే మంటిగోడ లాగా...దించుకుపోయి...వంగి సగమై ... కర్రను ఆనుకుంటూ...నిటారై...శూన్య దృష్టితో చూసి...ఆచూపే...పొలిమేర నుంచి...కనుచూపుమేరలో వున్న ఇంటి మీదికి మరల్చి...ఒక్కక్షణం నిలిపి... వంగి... నేలకు అంటుకునిపోయినట్లు అయి ...నెమ్మదిగా ... నె...మ్మ...ది...గా... నడుచుకుంటూ — ఇంటికి దూరమైపోయే త్రోవను...వెన్నెలఅంచుల కదనుత్రొక్కే ...చీకటిగుంపులో...కలసిపోయింది...

...నర్మగర్భంగా...నవ్వుతూనే ఉన్నది, వె...న్నె...ల...